# భద్రాచలంలో బీఆర్ఎస్ భారీ ర్యాలీ

## వెయ్యి ద్విచక్ర వాహనాలతో ర్యాలీ

భద్రాచలం, నవంబర్ 28 : భద్రాచలం పట్టణంలో బీఆర్ఎస్ శ్రేణులు వెయ్యి బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించాయి. మంగళవారం ప్రచారానికి చివరిరోజు కావడంతో బైక్‌లు, కార్లు, డీజే సౌండ్స్‌తో ప్రచార రథంలో బీఆర్ఎస్ పాటలు వినిపిస్తూ పట్టణాన్ని హోరెత్తించారు. ఇప్పటికే దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం, వాజేడు మండలాల్లో పలుమార్లు ఎమ్మెల్సీ, భద్రాచలం నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి తాతా మధుసూదన్‌తో కలిసి ప్రచారం నిర్వహించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు ఆఖరు రోజు భద్రాచలంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ భద్రాచలం నియోజకవర్గంలో ఈసారి తాను గెలిచి అసెంబ్లీకి వెళ్తానని దీమా వ్యక్తం చేశారు. డిసెంబర్ 3న గులాబీదండు విజయోత్సవాలకు సిద్ధంగా ఉండాలన్నారు. గత రెండు పర్యాయాలు కాంగ్రెస్ పార్టీకి ఎందుకు ఓటేశామని ప్రజలు బాధ పడుతున్నారని, ఈసారి మాత్రం కారు గుర్తుకే ఓటేస్తారని తెలిపారు. భద్రాచలం నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ పార్టీతో వేసారిపోయారని, దళితబంధు పేరుతో దళితులను కాంగ్రెస్ నాయకులు దోచేసారని పేర్కొన్నారు. తనను గెలిపిస్తే కరకట్ట నిర్మాణాన్ని అతి త్వరలో పూర్తి చేస్తానని చెప్పారు. కాంగ్రెస్ నాయకులు డబ్బుతో ఓటర్లను కొనాలని చూస్తున్నారని విమర్శించారు. ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసిన ఈసారి భద్రాచలం నియోజకవర్గ ప్రజలు తనను ఆశీర్వదించి గెలిపిస్తారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు గెలవకముందే మూడు గంటల కరెంట్ చాలని, 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని చెబుతున్నారని, కర్ణాటకలో ఇచ్చిన హామీలను ఇంతవరకు అమలు చేయలేని వాళ్లు ఇక్కడ అమలు చేస్తారా? అని ప్రశ్నించారు. గత తొమ్మిదిన్నర ఏళ్లుగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రతి ఇంటికి ఏదో ఒక పథకం అందేలా చేసి, ప్రతి ఇంటికి పెద్దన్నలా సీఎం కేసీఆర్ మారారన్నారు. బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుపై ఓటేయ్యాలని అభ్యర్థించారు. చర్ల రోడ్డులోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్, యూబీరోడ్డు, చప్టా దిగువ మీదుగా ముదిరాజ్ బజార్, సాయిబాబా ఆలయం, కూనవరం రోడ్డు, పాత మార్కెట్, జగదీశ్‌కాలనీ, రాజరాజేశ్వరి ఆలయం మీదుగా డబుల్ బెడ్రూం ఇళ్ల నుంచి తిరిగి పార్టీ కార్యాలయం వద్దకు భారీ ర్యాలీ చేరుకుంది. కార్యక్రమంలో ఎమ్మెల్యే తాతా మధుసూదన్, మండల ఇన్‌చార్జి మల్లెల రవిచంద్ర, మండల అధ్యక్ష, కార్యదర్శులు అరికెల్ల తిరుపతిరావు, కొండిశెట్టి కృష్ణమూర్తి, 41 బూత్‌ల ఇన్‌చార్జిలు భారీ ఎత్తున కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



భద్రాచలంలో వెయ్యి బైక్‌లతో భారీ ర్యాలీ చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

### ముగిసిన ప్రచారం

భద్రాచలం, నవంబర్ 28 : నెలరోజులుగా హోరెత్తించిన ఎన్నికల ప్రచారం మంగళవారం ముగిసింది. ఉదయం 6 నుంచి రాత్రి 8గంటల వరకు ప్రచార వాహనాలతో హోరెత్తించిన మైకులు మూగబోయాయి. మంగళవారం సాయంత్రం 4గంటలకు ప్రచారం ముగించాలని, 5గంటలకు వాహనాలు రోడ్డుపై కనపడకూడదని ఎలక్షన్ కమిషన్ ఆదేశాలతో చివరిరోజు భద్రాచలం బీఆర్ఎస్ నాయకులు పట్టణంలో సుమారు 1000 బైకులతో భారీ ర్యాలీ నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించి, తమకే ఓటేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారం ముగియడంతో రోడ్లు, వీధులన్ని బోసి పోయాయి. గురువారం జరిగే ఎన్నికల్లో అభ్యర్థుల భవితవ్యం తేలనుంది.

## తెల్లంను భారీ మెజార్టీతో గెలిపించాలి

**ఎంపీపీ సతీశ్‌కుమార్**

వెంకటాపురం(నూగూరు), నవంబర్ 28 : భద్రాచలం నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వెంకటాపురం ఎంపీపీ చెరుకూరి సతీశ్‌కుమార్, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి డరా దమోదర్ అన్నారు. వెంకటాపురం మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వీఆర్‌కే పురం, రాచపల్లి పంచాయతీలో రోడ్ షోతో పాటూ ఇంటింటి ప్రచారం చేస్తూ వెంకట్రావుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే బీఆర్ఎస్ అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపిస్తేనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు డర్రా దామోదర్, వేల్పురి లక్ష్మీనారాయణ, ముడుంబా శ్రీను, పిల్లారశెట్టి మురళి, జాగర శివాజీ, శాంతమూర్తి, జక్కుల సమ్మయ్య పాల్గొన్నారు.

మహిళల ఎన్నికల ప్రచార ర్యాలీ

చర్ల, నవంబర్ 28 : రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరిరోజు మంగళవారం మండల కేంద్రం చర్లలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. వందలాదిమంది మహిళలు గడపగడపకూ వెళ్లి భద్రాచలం బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావును కారు గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. ఈవీఎంల నమూనాలతో వెళ్లి విస్తృతంగా ప్రచారం చేశారు. కేసీఆర్ జిందాబాద్.. కారు గుర్తుకే మన ఓటు అంటూ మహిళలు నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. మండల కార్యాలయంల నుంచి సాగిన ర్యాలీ గాంధీసెంటర్, బస్టాండ్ సెంటర్, అంబేద్కర్ సెంటర్ మీదుగా సాగింది. ఈ ర్యాలీలో పోలూరి సుజాత, సోయం కృష్ణవేణి, సోయం రాజారావు, ఎంపీపీ కోదండ రామయ్య, కాపుల కృష్ణార్జునరావు, కొటేరు శ్రీనివాసరెడ్డి, ఇరసవడ్ల రాము, చింతా నాగుబాబు, కాపుల నాగరాజు, దొడ్డి తాతారావు, అజీజ్, ఆలం ఈశ్వర్, సోలూరి రమేశ్, కుక్కడపు సాయి, వేముల సాయి, దొడ్డి సూరిబాబు, అనిల్, పంజా రాజు మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

## పర్ణశాలలో తిప్పన సిద్దులు ప్రచారం

పర్ణశాల, నవంబర్ 28 : ఎన్నికల ప్రచారానికి చివరి రోజైన మంగళవారం పర్ణశాల గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ తరపున భద్రాచలం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావ్ విజయాన్ని కాంక్షిస్తు తెలంగాణ ఉద్యమకారుడు తిప్పనసిద్దులు ప్రచారం నిర్వహించారు. ముక్కెర రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ ప్రచారంలో ఆయన మాట్లాడుతూ... 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని కాంగ్రెస్ పార్టీ వారు మోసం చేయడం జరిగిందని వివరించారు. 2014లో ఏర్పడిన ప్రత్యేక తెలంగాణ కేసీఆర్ కృషి వల్ల రావడం జరిగిందని, అప్పటినుంచి ఇప్పటివరకు ఏ ప్రభుత్వాలు కానీ దేశంలో సంక్షేమ పథకాలను అమలు చేసి అన్ని కులాల వారికి ప్రత్యేకమైన కార్పొరేషన్లు ఏర్పాటు చేసి అభివృద్ధికి పునాది వేశారని, అటువంటి వ్యక్తిని కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, జొన్నలగడ్డ సూరిబాబు, ఆకుల సత్యనారాయణ, కల్లాకుల నరసింహారావు, జొన్నలగడ్డ సత్యనారాయణ, ముక్కెర లక్ష్మీపతి, ముక్కెర పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.



చర్లలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తల ప్రచారం



వెంకటాపురం : ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎంపీపీ సతీశ్



పర్ణశాలలో సమావేశంలో మాట్లాడుతున్న తిప్పన సిద్దులు

## ఘనంగా రామయ్య నిత్య కల్యాణం



స్వామివారికి నిత్య కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు

భద్రాచలం, నవంబర్ 28 : భద్రాద్రి సీతారామచంద్రస్వామి దేవస్థానంలో మంగళవారం నిత్య కల్యాణం పునః ప్రారంభించారు. సోమవారం కృత్తికా దీపోత్సవాన్ని పురస్కరించుకొని సీతారాముల నిత్యకల్యాణాన్ని నిలిపివేశారు. వేడుక ముగియడంతో నిత్య కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్య పూజలు, నిత్య బలిహరణం, నిత్య హోమాలను భక్తి, ప్రపత్తులతో జరిపారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చి శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం నిర్వహించి, కల్యాణంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

## వచ్చేనెల 1న శ్రీరామ పునర్వసు దీక్షలు ప్రారంభం

### 28న దీక్షా విరమణ.. 29న పట్టాభిషేకం

భద్రాచలం, నవంబర్ 28 : భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో డిసెంబర్ 1న కార్తీక పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని శ్రీరామ పునర్వసు దీక్షలను భద్రుని మండపంలో ఉదయం 10గంటలకు ప్రారంభించనున్నట్లు ఈవో ఎల్.రమాదేవి మంగళవారం ప్రకటనలో తెలిపారు. పునర్వసు దీక్షా విరమణ డిసెంబర్ 28న మార్గశిర పునర్వసు నాడు ఉంటుందని, ఉదయం 5:30 గంటలకు శ్రీరామ పునర్వసు దీక్షా విరమణ, గిరి ప్రదక్షిణ, పాదుకాపూజ అనంతరం దీక్షా విరమణ జరుగుతుందని పేర్కొన్నారు. అదేరోజు రాత్రి 7గంటలకు వెండి రథోత్సవం, 29న పుష్యమి నక్షత్రం సందర్భంగా రామయ్యకు పట్టాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందాలని కోరారు.

## ఓటర్లలో చైతన్యం నింపేందుకే ఫ్లాగ్‌మార్చ్



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ 141బెటాలియన్ బలగాలు

భద్రాచలం, నవంబర్ 28 : భద్రాచలం ఏజెన్సీ ప్రాంతం మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో భద్రాచలం నియోజకవర్గ ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు, వారిలో మనోధైర్యం కల్పించేందుకు భద్రాచలం పోలీసుశాఖ, సీఆర్పీఎఫ్ 141బెటాలియన్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్లు భద్రాచలం ఏఎస్పీ పరితోశ్ పంకజ్ తెలిపారు. ఏఎస్పీ కార్యాలయం నుంచి పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఫ్లాగ్‌మార్చ్ జరిపారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ మావోయిస్టులు, ఇతర అసాంఘిక శక్తులు ప్రజలను పోలింగ్ ప్రక్రియలో పాల్గొనకుండా చేసే అవకాశం ఉన్నందున ఎన్నికల సమయంలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకున్నామని అన్నారు. ఫ్లాగ్ మార్చ్‌తో ఎన్నికల పట్ల విశ్వాసం, నైతికత పెరుగుతుందన్నారు. పోలింగ్‌శాతం కూడా పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ సీఐ నాగరాజ్‌రెడ్డి, ఎస్సైలు మధుప్రసాద్, పీవీఎన్ రావు, విజయలక్ష్మి, ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్, అదనపు ఎస్సైలు, హెడ్ కానిస్టేబుల్స్, హోంగార్డులు పాల్గొన్నారు.

## వచ్చేనెల 18న సుబ్రహ్మణ్యస్వామి కల్యాణ మహోత్సవం

కొత్తగూడెం టౌన్, నవంబర్ 28 : మున్సిపాలిటీ పరిధిలోని బూడిదగడ్డలో ఉన్న మహంకాళి అమ్మవారి ఆలయంలో వచ్చేనెల 18వ తేదీన సుబ్రహ్మణ్య షష్టిని పురస్కరించుకొని సుబ్రహ్మణ్య కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి నరేంద్రభవాని స్వామి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కల్యాణం అనంతరం మధ్యాహ్నం ఒంటిగంటకు అన్నప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.